సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం, 23, నవంబర్, 2024



వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ప్రధానమని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పేర్కొన్నారు. 8లో



థాంగ్ టా పోటీల్లో ప్రతిభ

పాడేరులో నిర్వహించిన థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ అంతర జిల్లాల పోటీల్లో కంఠబంనుగుడ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. 8లో



క్షీరాభిషేక సేవ

విశాఖలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.





చలి.. చక్కిలిగిలి

దట్టమైన మంచు తెరలు.. ఆపై వణికించే చలి.. ఉదయం 9 గంటల వరకు మంచు దుప్పటి కప్పినట్టుగా గ్రామాలు... శీతాకాలంలో మన్యంలో ఇవన్నీ సర్వసాధారణం. ఎముకలు కొరికే చలిలో గిరిజనులు దైనందిన జీవనంలో మమేకమవుతారు. ఇంటిల్లపాది వేకువజామున వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. గజగజ వణికించే చలిలో మహిళలు బోర్లు, వాగుల వద్దకు వెళ్లి నీటిని తీసుకుని వస్తుంటారు. వాహన చోదకులు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తుంటారు. సాయంత్రం 4 గంటల నుంచి చలి తీవ్రత మొదలవడంతో చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందుతారు. ఇవన్నీ వారి శ్రమైక జీవనంలో భాగమే. – ముంచంగిపుట్టు





న్యూస్‌రీల్

ఐటీఐలో ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా స్వల్పకాలిక కోర్సులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఐటీఐలో నేరుగా సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీగా సీతారామ్

సాక్షి,పాడేరు: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీగా బి.సీతారామ్ నియమితులయ్యారు. విశాఖలోని సీఏఆర్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను జిల్లాకు బదిలీ చేస్తూ ఏపీ డీజీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీగా పనిచేస్తున్న జీయూకేఎల్‌వీ సుబ్బరాజును కోనసీమ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీగా బదిలీ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

- ఈనెల 24లోగా అభ్యంతరాల స్వీకరణ
- పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలతాదేవి

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నాలుగు క్యాడర్లలో భర్తీ చేయనున్న పోస్టులకు గాను అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను శుక్రవారం విడుదల చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి తెలిపారు. జనరల్ డ్యూటీ అటెండెంట్(జీడీఏ), జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ జాబితను వెంటనే పరిశీలించుకోవాలన్నారు. ఈనెల 23,24తేదీల్లో సాయంత్రం అభ్యర్థనలు స్వీకరిస్తామని తెలిపారు. చివరి రోజు సాయంత్రం 5గంటల వరకు మాత్రమే స్వీకరిస్తామని ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలన్నారు. అభ్యర్థనలను నేరుగా లేదా మెయిల్ ద్వారా నిర్ణీత గడువులోగా అందజేయాలన్నారు. recruitmentgmcpaderu@gmail.com కు మెయిల్ పంపించాలని సూచించారు. అభ్యర్థుల పేరు, దరఖాస్తు చేసుకున్న ఉద్యోగం, దరఖాస్తు సెంటర్‌ను అభ్యంతరాల్లో పొందుపరచాలని ఆమె కోరారు. అభ్యంతరాలు పరిశీలన అనంతరం అఖరి యోగ్యత జాబితాను విడుదల చేస్తామని ఆమె తెలిపారు.

గిరిజనులకు అండగా ఉంటాం

- రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్



పాతకోటలో గిరిజనులతో మాట్లాడుతున్న రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్

మారేడుమిల్లి : ఏజెన్సీలోని గిరిజనులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని, రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్ అన్నారు. గుర్తేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాతకోట పంచాయతీలోని బడియా కొప్పులకోట, రెడ్డి కొప్పులకోట, జనముగుడా, పులుసు మామిడి, గంగనూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భగా ఆయా గ్రామాల గిరిజనులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. చెడు అలవాట్లు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయి పండించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పులసుమామిడి, గంగనూరు పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు పుస్తకాలు, యువతకు వాలీబాల్ కిట్లు, స్థానిక గిరిజన రైతులకు ఆకుకూరల విత్తనాలు, రగ్గులు పంపిణీ చేశారు. గిరిజనులతో కలిసి సామూహిక భోజనాలు చేశారు. మారేడుమిల్లి సీఐ గోపాల్ కృష్ణ, గుర్తేడు ఎస్ఐ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నుంచి మినహాయించాలి



గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న తమను గెస్ట్, పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ టీచర్లు అని పేర్లు మార్చారు. వేతనాల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు. 2010 పీఆర్సీ ప్రకారం కాకుండా 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలి. మెగా డీఎస్సీలో మేము పనిచేస్తున్న స్థానాలను మెగా డీఎస్సీలో ప్రభుత్వం ఖాళీగా చూపించింది. తమ పోస్టులకు మినహాయింపు ఇవ్వాలి.

– కె. భాస్కర్‌రావు, ఉపాధ్యాయుడు, గిరిజన గురుకుల పాఠశాల, అరకువేలి

శ్రమ దోపిడీకి గురవుతున్నాం



గురుకులంలో సుమారు పదేళ్లుగా పీఈటీగా అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నా. ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు విధులు నిర్వహిస్తున్నా. కానీ వేతనం నెలకు కేవలం రూ.9500 మాత్రమే. పనికి తగిన వేతనం అందక శ్రమ దోపిడీకి గురవుతున్నా. మా న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

– సుబ్బు, పీఈటీ, మారికవలస గురుకుల విద్యాలయం

బోధనకు బ్రేక్

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆందోళన ఎఫెక్ట్

- ఆందోళనకు దిగిన గురుకులాల అవుట్ సోర్సింగ్ గురువులు
- కొనసాగుతున్న విధుల బహిష్కరణ
- సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం
- విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని వైనం
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టక పోవడంపై తల్లిదండ్రుల ఆవేదన

గురుకులాల్లో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వీటిలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. దీంతో వారం రోజులుగా విద్యార్థులకు బోధన అందడం లేదు. వారి న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం వల్ల ఆందోళన కొనసాగిస్తున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న బోధన పరమైన సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంపై వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొయ్యూరు గురుకుల పాఠశాల



పాడేరు ఐటీడీఏ ఎదుట ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

పాడేరు/కొయ్యూరు: గిరిజన గురుకుల విద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థులకు బోధన కుంటుపడింది. వీటిలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనకు దిగారు. విధులను బహిష్కరించి పాడేరు ఐటీడీఏ ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

ఆందోళనలో 280 మంది..

జిల్లాలో గురుకుల పాఠశాలలు 10, గురుకుల కళాశాలలు 9 ఉన్నాయి. గురుకులాల పరిధిలో 4వేల మంది విద్యార్థులు చదువుతుండగా వీరిలో సుమారు 800 మంది టెన్త్ విద్యార్థులు ఉన్నారు. గురుకుల కళాశాలల్లో 2,700 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటికి చెందిన సుమారు 280 మంది అవుట్ సోర్సింగ్ టీచర్లు, అధ్యాపకులు ఆందోళనలో పాల్గొంటున్నందున బోధన సాగడం లేదు. గురుకుల విద్యాలయాల్లో కేవలం ప్రిన్సిపాళ్లు మాత్రమే ఉన్నారు.

టెన్త్, ఇంటర్‌పై ప్రభావం

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆందోళన కారణంగా టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పాఠాలు బోధించే వారే కరువయ్యారు. ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే సిలబస్ మాత్రమే పూర్తయింది. మిగతా 75 శాతం బోధించాల్సి ఉంది. ఆందోళన కొనసాగితే విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది. ఇదే పరిస్థితి కొనసాగితే గురుకుల విద్యాలయాల్లో ఈఏడాది టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణతపై ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపి అవుట్ సోర్సింగ్ టీచర్లు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించి, విద్యార్థులకు బోధన అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రెగ్యులర్ చేయాలి

జి.మాడుగుల: గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ టీచర్లుగా మార్పు చేయాలని ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.కొండబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన 2024 మెగా డీఎస్సీ నుంచి గిరిజన గురుకులాల్లోని 1143 పోస్టులను మినహాయించాలని ఆయన కోరారు. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తామంతా పాడేరులో దీక్షలు చేపట్టామన్నారు.

జిల్లా సమాచారం

గురుకుల పాఠశాలలు	:	10
విద్యార్థుల సంఖ్య	:	4 వేలు
టెన్త్ విద్యార్థులు	:	800
గురుకుల కళాశాలలు	:	9
విద్యార్థులు	:	2700 మంది
ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న టీచర్లు, అధ్యాపకులు	:	280

డిమాండ్లు ఇవీ..

- అవుట్ సోర్సింగ్ నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో మార్చాలి
- 2022 పీఆర్సీ ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి
- గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను మెగాడీఎస్సీ నుంచి మినహాయించాలి.
- పని వేళలు మార్పు చేయాలి
- 2014 కన్నా ముందు ఉన్న అవుట్ సోర్సింగ్ టీచర్లను రెగ్యులర్ చేయాలి.

కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలి



దేశ చరిత్రలో ఏ విద్యా సంస్థలో కూడా అవుట్‌సోర్సింగ్ పద్ధతి లేదు. కేవలం మన గిరిజన గురుకులాల్లో మాత్ర మే అవుట్ సోర్సింగ్ విధానం ఉంది. 2010 పీఆర్సీ ప్రకారమే నెలకు కేవలం రూ.18 వేలు చెల్లిస్తోంది. కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చితే నెలకు రూ.రూ.40వేలు వస్తుంది. కాంట్రాక్ట్ విధానంలో ప్రభుత్వం మార్పు చేయాలి.

– జి.చిరంజీవి, ఆంగ్ల అధ్యాపకుడు, గురుకుల కళాశాల, జి.మాడుగుల

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి డిమాండ్
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని చంద్రబాబుకు సూచన

పాడేరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు నేరుగా గడప వద్దకే అందించి దేశ చరిత్రలో ఓ నూతన అధ్యాయానికి తెరతీసిందని, దీనిపై కూటమి ప్రభుత్వం ద్వంద్వ వైఖరితో నిర్లక్ష్యం చేస్తోందని ఆమె విమర్శించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే వ్యవస్థపై గత ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తీవ్ర విమర్శలు చేశారన్నారు. సరిగ్గా ఎన్నికల సమయంలో వలంటీర్ల సేవలు రాష్ట్రానికి ఎంతో అవసరమని, తాము అధికారంలోకి వస్తే రూ.10వేల గౌరవ వేతనం ఇచ్చి కొనసాగిస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను విధుల్లోకి తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వలంటీర్లు ఎటువంటి ఉపాధి లేక గ్రామాల్లో ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకొని రూ.10వేల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల సమస్య పరిష్కారం అయ్యేంత వరకు వారికి వైఎస్సార్‌సీపీ వారికి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

టేకు ప్లాంటేషన్ల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న సబ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి

రాజవొమ్మంగి: స్థానిక అటవీక్షేత్ర పరిధి బడదనాంపల్లి బీటులోని టేకు ప్లాంటేషన్లను శుక్రవారం సబ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉషారాణి తెలిపారు. వయ్యేడు బీటులో ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను ఆయన పరిశీలించారన్నారు. కలప అక్రమ రవాణాపై నిఘా పెంచాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారని ఆమె తెలిపారు. అనంతరం అటవీక్షేత్ర కార్యాలయంలోని రికార్డులు తనిఖీ చేసినట్టు చెప్పారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువు

- ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి హైమవతి
- విశాఖలో న్యాయ విద్యార్థినిపై అత్యాచారానికి నిరసనగా ధర్నా
- ఐటీడీఏ ఎదుట బైఠాయింపు
- నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్



ర్యాలీలో ఆదివాసీ గిరిజన మహిళ సంఘం, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు, విద్యార్థినులు

పాడేరు : రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి హైమవతి విమర్శించారు. ఇటీవల విశాఖపట్నంలో ఓ న్యాయ విద్యార్థినిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా శుక్రవారం పాడేరులో ఆదివాసీ గిరిజన మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ గేటు వద్ద బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏదొక చోట మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. నిందితులకు సరైన శిక్ష పడకపోవడంతో మరింత రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో జన సంచారం ఉండే బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల మందు బాబుల ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. పట్టణానికి దూరంగా దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తప్పనిసరి

- కలెక్టర్ దినేష్‌కుమార్
- మీకోసంలో 98 వినతుల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్‌తో కలిసి 98 అర్జీలను స్వీకరించారు. వీటిని సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో పద్మలత, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఆర్‌అండ్‌బీ, టీడబ్ల్యూ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు బాలసుందర్‌బాబు, వేణుగోపాల్, జి.డేవిడ్‌రాజు, జవహర్‌కుమార్, టీడబ్ల్యూ ఇంచార్జి డీడీ రజని, ఐటీడీఏ ఏవో హేమలత, డీఎల్పీవో పీఎస్ కుమార్ పాల్గొన్నారు. ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ రెండు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. అనంతరం ఆయన ట్రాన్స్ జెండర్ల స్వయం సహాయక సంఘాన్ని ప్రారంభించారు. వీరికి స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ అందించాలని అధికారులను ఆదేశించారు.



చింతపల్లి సమీపంలో చిన్నగెడ్డ వద్ద దట్టంగా కురుస్తున్న మంచు



జిల్లా కేంద్రం పాడేరులో చలి మంటలను ఆశ్రయించిన ప్రజలు



డుంబ్రిగుడ మండలంలో మంచు తెరల్లో ఓ గిరిజన గ్రామం

వణుకుతున్న మన్యం

- మినుములూరులో 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- ఉదయం 10 గంటల వరకు దట్టంగా కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం పది గంటలకు సూర్యోదయం అయింది. సాయంత్రం 4గంటల నుంచి చలిగాలులు విజృంభిస్తున్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 10 డిగ్రీలు నమోదైంది. పొగమంచు కారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

శీతల గాలులతో..

చింతపల్లి: మన్యంలో చలి తీవ్రత పెరిగింది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల మన్యం ప్రజలు వణికిపోతున్నారు. రెండు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నిలకడగా ఉన్నాయి. అరకులోయలో శుక్రవారం 10.9 డిగ్రీలు , చింతపల్లిలో 13.2 డిగ్రీలు, పాడేరులో 13.4 డిగ్రీలు నమోదు అయినట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. గూడెంకొత్తవీధిలో 12.5 డిగ్రీలు, డుంబ్రిగుడలో 12.0, జి.మాడుగులలో 11.0, ముంచంగిపుట్టులో 10.3, హుకుంపేటలో 12.7, పెదబయలులో 12.4, అనంతగిరిలో 11.1, కొయ్యూరులో 16.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు ఆయన పేర్కొన్నారు.

హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు

డుంబ్రిగుడ: మండలంలో చలి పంజా విసురుతోంది. వారం రోజులుగా ఉదయం 9.30 వరకు మంచు కురుస్తోంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, పొలాలకు వెళ్లే గిరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అరకు నుంచి కించుమండ వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించనంతగా శుక్రవారం మంచు దట్టంగా కురిసింది. హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు.

ముగిసిన 'ఏకలవ్య' క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న బాలురు

అరకులోయ క్రీడా పాఠశాల మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఏకలవ్య పాఠశాల క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. 8లో

క్లుప్తంగా

థాంగ్ టా పోటీల్లో ప్రతిభ

- పతకాలు సాధించిన ఐశ్వర్య, దేదీప్య

అరకులోయ రూరల్: జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించిన థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ అంతర జిల్లాల పోటీల్లో మండలంలోని కంఠబంసుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఇదే పాఠశాలల్లో ఆరవ తరగతి చదువుతున్న సొనాయి ఐశ్వర్య ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్.దేదీప్య ద్వితీయస్థానం సాధించింది. వీరిని శుక్రవారం పీడీ సూరిబాబు, హెచ్ఎం మోహనరావు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



పూజలో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం: మండలంలోని ఇర్లపల్లిలో గొడవర్తి ప్రసన్నకుమార్ శర్మ అర్చకత్వంలో శుక్రవారం మహా పడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ ధర్మశాస్త్రాపీఠం నిర్వాహక అయ్యప్ప స్వామీ దీక్ష మాలధారణ స్వాములు సూర్యనారాయణరాజు(కిట్టు) దీక్ష చైతన్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గురుస్వాములు పుత్సల వీరన్న, వీర్రాజు(లెక్చరర్) జెట్టి అప్పలరాజు, సూరిశెట్టి కృష్ణలు పడి పూజను పర్యవేక్షించారు. రంపచోడవరం, గోకవరం, అడ్డతీగల, దేవీపట్నం ప్రాంతాల నుంచి అయ్యప్ప, శివ మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగుపాము హతం



జి.మాడుగుల: మండలం కేంద్రంలోని ఆర్టీసీ బస్‌ష్టేషన్ ఆవరణలో నాగుపాము సంచరిస్తుండడంతో కొంతమంది కర్రలతో కొట్టి చంపేశారు. ఈ ప్రాంతంలో పాము సంచరిస్తూ తొండను మింగటానికి ప్ర యత్నించినట్టు స్థానికులు గుర్తించారు. దీంతో కొందరు పరుగులు తీశారు. స్థానికులు కర్రలతో పామును కొట్టి హతం చేశారు. ఈ నాగుపాము 9 అడుగుల పొడవు ఉన్నట్టు స్థానికులు చెప్పారు.

ముగిసిన 'ఏకలవ్య' క్రీడా పోటీలు

అరకులోయ టౌన్: స్థానిక క్రీడా పాఠశాల మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఏకలవ్య పాఠశాలల క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలను సంబంధిత అధికారవర్గాలు వెల్లడించాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

- **హ్యాండ్‌బాల్:** అండర్–19 బాలుర విభాగంలో అనంతగిరి జట్టు విన్నర్, ములియాపుట్టు–రన్నర్. బాలికల విభాగంలో చింతూరు–విన్నర్, డుంబ్రిగుడ జట్టు–రన్నర్‌గా నిలిచింది.
- **బాక్సింగ్:** అండర్–14లో 48 కేజీల విభాగంలో రంపచోడవరం విద్యార్థి జశ్వంత్, అండర్–19లో 40 కేజీల విభాగంలో వై.రామవరం విద్యార్థి సుబ్బారెడ్డి, 43 కేజీల విభాగంలో వై.రామవరం విద్యార్థి శివప్రసాద్, 47 కేజీల విభాగంలో అదే పాఠశాలకు చెందిన రామచంద్రన్‌దొర, 53 కేజీల విభాగంలో జీఎల్ పురం విద్యార్థి మోహన్‌రావు, 56 కేజీల విభాగంలో వై.రామవరం విద్యార్థి రాహుల్‌దొర ప్రథమ స్థానం సాధించారు.
- **టెన్నిస్:** అండర్ –19 బాలుర విభాగంలో రంపచోడవరం విద్యార్థి కృష్ణ విన్నర్‌గా, మారేడుమిల్లికి చెందిన నిఖిల్ రన్నర్‌గా నిలిచారు. అండర్ –19 డబుల్స్ విభాగంలో రంపచోడవరం విద్యార్థి కృష్ణ ఎంవై నాయక్ విన్నర్‌గా మారేడుమిల్లికి చెందిన నిఖిల్ చంద్ర, శశివర్ధన్ రన్నర్‌గా నిలిచారు.
- **యోగా:** అండర్–14 బాలుర విభాగంలో జీఎల్ పురం విద్యార్థి వై.అరవింద్ ప్రథమ స్థానం, అదే పాఠశాలకు చెందిన దినేష్‌కుమార్ ద్వితీయ, శ్రీధరన్ తృతీయ, అనంతగిరి పాఠశాలకు చెందిన పి.గోపాలకృష్ణ నాలుగో స్థానంలో నిలిచారు. బాలురు అండర్–19 విభాగంలో రాజవొమ్మంగికి చెందిన శ్రీనివాస్ ప్రథమ, కంద్రిగకు చెందిన లాల్ నజీర్ ద్వితీయ, డోర్నాలకు చెందిన క్రిషిల్ తృతీయ, అనంతగిరికి చెందిన గౌతం నాలుగో స్థానం కైవసం చేసుకున్నారు.



క్రీడాకారులతో గురుకులం ఓఎస్డీ రఘునాథ్ తదితరులు

- **చెస్:** అండర్–14 బాలికల విభాగంలో రంపచోడవరం విద్యార్థి శ్రీవిద్య ప్రథమ, వి.విద్య ద్వితీయ, మారేడుమిల్లికి చెందిన రంజిత శ్రీ తృతీయ స్థానం సాధించారు. అండర్ 19 బాలికల విభాగంలో జీకేవీధికి చెందిన భూమిక ప్రథమ, వై.రామవరం విద్యార్థి యాలక్ష్మి ద్వితీయ, బుట్టాయగూడెం విద్యార్థిని సంజన తృతీయ స్థానంలో నిలిచారు.
- **జూడో:** అండర్ –14, 26 కేజీల బాలికల విభాగంలో అనంతగిరి విద్యార్థిని అనేష్ ప్రథమ, 27–32 కిలోల విభాగంలో అనంతగిరికి చెందిన సమిరా, 32–36 కిలోల విభాగంలో రాజవొమ్మంగికి చెందిన కౌసల్యకుమారి, 36–40 కిలోల విభాగంలో రాజవొమ్మంగికి చెందిన శ్రీహర్ష, 40–44 కిలోల విభాగంలో రాజవొమ్మంగికి చెందిన లషిమ్మ, 40 ప్లేస్ విభాగంలో రాజవొమ్మంగికి చెందిన హేమవర్ధని ప్రథమ స్థానం సాధించారు. బాలికల విభాగం అండర్–19లో ,32–36 కిలోల విభాగంలో రాజవొమ్మంగికి చెందిన పి.ఉమామహేశ్వరి, 36–40 కిలో విభాగంలో అదే పాఠశాలకు చెందిన లక్ష్మీ ప్రసన్న, 40–44 కిలోల విభాగంలో అదే పాఠశాలకు చెందిన దుర్గాపావని ప్రథమస్థానంలో నిలిచారు.
- హకీ పోటీల్లో అనంతగిరి, ములియపుట్టు జట్లు మొదటి రెండు స్థానాలు సాధించాయి.
- అండర్–19 బాలుర విభాగంలో భామిని జట్టు విన్నర్‌గా, మారేడుమిల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది.
- **ఖోఖో:** అండర్– 19 బాలికల విభాగంలో విన్నర్‌గా చింతూరు, రన్నర్‌గా భామిని జట్లు నిలిచాయి. ఖోఖో అండర్–19 బాలుర విభాగంలో మారేడుమిల్లి విన్నర్‌గా, చింతూరు జట్టు రన్నర్‌గా నిలిచాయి.
- **ఫుట్‌బాల్:** బాలుర విభాగంలో మారేడుమిల్లి విన్నర్, ఒజెల్లి జట్టు రన్నర్‌గా నిలిచాయి. మూడురోజులపాటు జరిగిన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, పతకాలను గురుకులం ఓఎస్డీ రఘునాథ్, గురుకులం కో–ఆర్డినేటర్ పీఎస్ఎన్ మూర్తి అందజేశారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

గూడెంకొత్తవీధి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు మత్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. గూడెంకొత్తవీధి మండలంలోని పలువురు పార్టీ నాయకులు, సర్పంచ్‌లు పాడేరు వెళ్లి ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా నేటి వరకు ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేక ఆ నెపాన్ని గత వైఎస్సార్ ప్రభుత్వంపై నిందలు వేస్తుందన్నారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులు తీసుకోవాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును కలిసిన వారిలో లక్కవరపేట సర్పంచ్ వీరేంద్రప్రసాద్, నాయకులు కంకిపాటి గిరి, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు తదితరులున్నారు.



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును కలిసిన గూడెంకొత్తవీధి మండల నాయకులు

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు: వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ప్రధానమని, పరిసరాల పరిశుభ్రత కోసం నిర్వహించే శ్రమదానంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పిలుపునిచ్చారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం ఘాట్‌రోడ్‌లోని వ్యూ పాయింట్ వద్ద వివిధ శాఖల సిబ్బంది, పర్యాటకులతో కలసి ఆయన స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ డివిజన్లోని పర్యాటక ప్రాంతాల పరిశుభ్రత కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని, పర్యాటకులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా స్వచ్ఛత పాటించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో చెత్త వేసేందుకు కుండీలు ఏర్పాటు చేస్తామన్నారు. సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద భద్రత వలయాలు ఏర్పాటుచేసి లోతు ఉన్న ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. అనంతరం స్థానిక గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన వనభోజన మహోత్సవంలో పీవో పాల్గొన్నారు. విద్యార్థులతో కలసి సరదాగా క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. పాఠశాలలోని గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలను ఐటీడీఏ ద్వారా అందిస్తామని పీవో తెలిపారు.



చింతూరు గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలసి క్రికెట్ ఆడుతున్న పీవో అపూర్వభరత్

కూటమి ప్రభుత్వం హామీలు అమలుచేయాలి

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం గ్రామ వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రామ వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు గోల్లోరి దేవ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వలంటీర్ల దేవ మాట్లాడుతూ ఎన్నికల ముందు గ్రామ వలంటీర్లకు రూ.10వేల వేతనం అందిస్తామని, వారిని విధుల్లో కొనసాగిస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు పైబడినా నేటికి వలంటీర్లను విధులోకి తీసుకోకుండా మోసం చేయడం తగదన్నారు. ఇటీవల మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి గ్రామ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.తక్షణమే వలంటీర్లను విధుల్లో తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ మేరకు గ్రామ వలంటీర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో పాడేరులో శనివారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ వలంటీర్లు కిరణ్, సుబ్బరావు, గిదోన్, పితబాష్, గుప్తా, ప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవ

సంప్రదాయ పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

చింతపల్లి: ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజన రైతులు సంప్రదాయ పంటల సాగుపై దృష్టి సారించి ఆర్థికాభివృద్ధి సాధించాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. పరిశోధన స్థానంలో నవంబర్ నెలకు సంబంధించి శిక్షణ (ఆత్మ విశాఖపట్నం సహకారంతో) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. గిరిజన రైతులకు రబీ కాలంలో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంప్రదాయ పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా రబీ కాలంలో సాగునీటి సదుపాయం లేకపోవడంతో పొలాలను బీడు భూములుగా ఉంచుకోవడంతో ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారన్నారు. రబీ సీజన్‌లో ఈ ప్రాంతాన్ని నీరు, మంచుతో మాత్రమే పండే అనుకూల రకాల పంటలకు సంబంధించి పరిశోధన స్థానంలో పరిశోధనలు జరుగుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు తమ తమ ప్రాంతాలకు సంబంధించిన స్థితిగతులను వివరించారు. పాడేరు ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు చేపడుతున్న ప్రయోగాత్మక పరిశీలన క్షేత్రాలు, సందర్శన క్షేత్రాల ఫలితాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.బయ్యపురెడ్డి , డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి, డాక్టర్ వెంకటేష్‌బాబు, బి.ఎన్.సందీప్ నాయక్, పి.జోగారావు, ఉద్యానవన పరిశోధన స్థానం అధిపతి శెట్టి బిందు, అరుకు, చింతపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు మోహనరావు, కంతా జాహ్నవి, మండల వ్యవసాయ అధికారులు పద్మ, శోభ, పాడేరు డీఆర్‌సీ అధికారి విజయలక్ష్మి , పశుసంవర్ధకశాఖ అధిపతి డాక్టర్ దమయంతి, రైతులు పాల్గొన్నారు.



చింతపల్లిలో పరిశోధన స్థానంలో మాట్లాడుతున్న ఏడీఆర్ అప్పలస్వామి

వరిలో మెడవిరుపు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

రాజవొమ్మంగి: పూర్తిగా పక్వానికి వచ్చిన ఖరీఫ్ వరి పంటను ప్రస్తుతం మెడవిరుపు తెగులు పట్టి పీడిస్తోందని స్థానిక వ్యవసాయాధికారి పి.చక్రధర్ అన్నారు. మండలంలోని పలు వ్యవసాయ క్షేత్రాలను ఆయన శుక్రవారం సందర్శించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ తెగులు సోకిన వరి కంకులు విరిగి ముక్కలు ముక్కలుగా నేలరాలిపోతాయన్నారు. చలి తీవ్రత కారణంగా ఈ తెగులు ఆశిస్తోందన్నారు. ఈ తెగులు ముఖ్యంగా ఎంటీయూ 1061 రకం వరి పంటపై గింజలు పాలు పోసుకొనే, గింజ గట్టిపడే దశలో ఎక్కువగా కనుపిస్తోందన్నారు. ఈ తెగులు వల్ల పంట నష్టం అధికంగా ఉంటుందన్నారు. ఈ తెగుళ్ల నివారణకు ఎకరాకు ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్, టెబుక్లోనోజోల్ 80 గ్రాములు లేదా ట్రైసైక్లోజోల్, పికోక్సీస్ట్రోబిన్ 400 మిల్లీలీటర్లు పిచికారీ చేసుకోవాలన్నారు. అజోక్సీస్ట్రోబిన్, డిఫెనోకోనోజోల్ 200 మిల్లీలీటర్ల మందు ఎకరాలకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని వ్యవసాయాధికారి చక్రధర్ సూచించారు.

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింథియా: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్(సెమ్స్), వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నాయి. 18 నుంచి 27 ఏళ్ల వయసు ఉండి.. ఇంటర్, ఐటీఐ, డిప్లమో కోర్సుల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఉత్తీర్ణులైన యువతీయువకులు శిక్షణకు అర్హులు. విశాఖపట్నం పోర్టు పరిసర ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు సింథియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో గానీ, 86884 11100, 0891–2704010 నంబర్లకు గానీ సంప్రదించవచ్చు. ఈ నెల 30వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సెమ్స్ వర్గాలు తెలిపాయి.

శ్రీకాకుళం రోడ్–కొల్లాం మధ్య స్పెషల్స్

తాటిచెట్లపాలెం: ఈ సీజన్‌లో శబరిమలై ప్రయాణించే మాలధారులకోసం ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ ప్రత్యేక ఏర్పా ట్లు చేస్తోంది. శ్రీకాకుళం రోడ్–కొల్లాం–శ్రీకాకుళం రోడ్ మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతోంది. ప్రస్తుతం నడుస్తున్న విశాఖ–కొల్లా–విశాఖ రైలును ఫిబ్రవరి వరకు పొడిగించారని రైల్వేఅధికారులు కోరుతున్నారు.

శ్రీకాకుళం రోడ్–కొల్లాం–శ్రీకాకుళం స్పెషల్...

శ్రీకాకుళం రోడ్–కొల్లాం(08553) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారాల్లో ఉదయం 6 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరి సోమవారాల్లో మధ్యాహ్నం 2.30గంటలకు కొల్లాం చేరుకుంటుంది. జనవరి 26వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం–శ్రీకాకుళం రోడ్(08554) ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారాల్లో సాయంత్రం 4.30గంటలకు కొల్లాంలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 10.35గంటలకు చేరుకుని అక్కడ నుంచి 10.40గంటకు బయల్దేరి బుధవారం తెల్లవారు 2.30 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.

- విశాఖ–కొల్లం(08539) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారాల్లో ఉదయం 8.20గంటలకు విశాఖలో బయల్దేరి గురువారాల్లో మధ్యాహ్నం 12.55గంటలకు కొల్లాం చేరుకుంటాయి. ఫిబ్రవరి 26వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో ప్రతీ గురువారాల్లో కొల్లాంలో రాత్రి 7.35గంటలకు బయల్దేరి శుక్రవారాల్లో రాత్రి 11.20గంటలకు విశాఖ చేరుకుంటాయి.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- గురుకుల కళాశాలను సందర్శించిన ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ బాబు
- నిర్వహణ తీరుపై అసంతృప్తి
- గతంలో సందర్శించినా ఎటువంటి మార్పు లేదని ఆగ్రహం

రంపచోడవరం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలను రంపచోడవరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.బాబు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు ఆయన గురుకుల కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను, బోధన తీరును, కళాశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ బాబు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల నిర్వహణకు నిధులు వెచ్చిస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. కళాశాలలో తక్షణమే విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కళాశాల, వసతి గృహాల్లో శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. గతంలో తాను గురుకుల కళాశాలను తనిఖీ చేశానని, అప్పటికీ ఇప్పటికీ ఎటువంటి మార్పు లేదని మేజిస్ట్రేట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని కూరగాయలు వాడకం, అపరిశుభ్రత కలిగిన మరుగుదొడ్లు నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణి వద్దన్నారు. కళాశాల వసతి గృహం గదులు, ప్రాంగణంలో అవసరమైన లైట్‌లు ఏర్పాటు చేయించడంతో విద్యార్థులు మేజిస్ట్రేట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయన వెంట న్యాయవాది ఎంవీఆర్ ప్రశాంత్, ఎస్ఐ తదితరులు ఉన్నారు.



గురుకుల కళాశాలను సందర్శించి ఉద్యోగులతో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ బాబు



స్టోర్ రూమ్‌లో కూరగాయలు పరిశీలిస్తున్న మేజిస్ట్రేట్ బాబు

ఉన్నత విద్య అభ్యసించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

మోతుగూడెం: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్య అభ్యసించి, సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని డొంకరాయి ఎస్ఐ శివకుమార్ అన్నారు. డొంకరాయి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం మాదక ద్రవ్యాలపై సంకల్పం అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అమిత్, ఏఎస్పీ పంకజ్ కుమార్‌మీనా ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంకల్పం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి రవాణా, సాగుపై సమాచారాన్ని 9381123100కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

చింతపల్లిలో రేపు జిల్లా స్థాయి భజన పోటీలు

చింతపల్లి: జిల్లాస్థాయి భజన పోటీలు ఆదివారం చింతపల్లిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు నిర్వాహకులు విజయకుమార్, అశోక్ తెలిపారు. ధాన ధర్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలో పాల్గొనే వారు 15 మంది బృందంగా ఉండాలని, భజన సామగ్రిని బృందం సభ్యులే తీసుకురావాలని వారు సూచించారు. పూర్తి వివరాలకు 9392002994, 9392461202 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

నేటి నుంచే ధనాధన్ క్రికెట్

- వైఎస్సార్ స్టేడియంలో ఎస్ఎంఏ టోర్నీ గ్రూప్ డీ మ్యాచ్‌లు ప్రారంభం
- చండీగఢ్ పుదుచ్చేరి మధ్య తొలి మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ ధనాధన్ టీ–20 క్రికెట్ నేటి నుంచి ప్రారంభంకానుంది. సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్ఎంఏ) టోర్నీలో భాగంగా గ్రూప్ డీ మ్యాచ్‌లు వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే గ్రూప్‌లో తలపడుతున్న ఏడు జట్లలో ఆరు జట్లు స్టేడియం బీ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేసుకున్నాయి. శుక్రవారం ఉదయం సెషన్‌లో అసోం, రైల్వేస్ జట్లు, మధ్యాహ్నం సెషన్‌లో చండీగఢ్, పుదుచ్చేరి జట్లు నెట్స్‌లో శ్రమించాయి. సాయంత్రం సెషన్‌లో విదర్భ, ఒడిశా జట్లు ప్రాక్టీస్ చేశాయి. ఛత్తీస్‌గఢ్ జట్టు శనివారం వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేయనుంది. టోర్నీలో భాగంగా శనివారం నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు రోజు విడిచి రోజు విశాఖలో రెండు మ్యాచ్‌లు, విజయనగరంలో ఒక మ్యాచ్ జరగనుంది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో తొలి మ్యాచ్ శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. మరో మ్యాచ్ సాయంత్రం నాలుగున్నర గంటలకు డే నైట్‌గా జరగనుంది. ప్రస్తుత సీజన్‌లో విశాఖ వేదికగా ఆడుతున్న జట్లలో గతేడాది ఆయా గ్రూప్‌ల్లో విదర్భ టాపర్‌గా నిలవగా అసోం ద్వితీయ స్థానంలో నిలిచింది. గతేడాది ఎస్ఎంఏ టోర్నీలో అసోం ఆటగాడు రియాన్ పరాగ్ అత్యధిక స్కోర్‌తో టాపర్‌గా నిలిచాడు. ఈ సారి అసోం జట్టుకు దినేష్ దాస్, విదర్భకు కీపర్ బ్యాటర్ జితేష్ శర్మ, రైల్వేస్‌కు ఉపేంద్ర, పుదుచ్చేరికి దామోదర్, ఒడిశాకు గోవింద, చండీగఢ్‌కు మనన్ వోహ్రా, ఛత్తీస్‌గఢ్ జట్టుకు అమన్‌దీప్ నాయకత్వం వహిస్తున్నారు.



స్టేడియం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న జట్లు

హైదరాబాద్ వేదికగా తలపడనున్న ఆంధ్రా జట్టు

ఈ ట్రోఫీలో ఆంధ్రా జట్టు గ్రూప్ ఈలో హైదరాబాద్ వేదికగా ఆడనుంది. జట్టుకు రికీబుయ్ నాయకత్వం వహిస్తుండగా వైస్ కెప్టెన్‌గా రషీద్, వికెట్ల వెనుక భరత్ సహకరించనున్నాడు. అశ్విన్ హెబ్బర్, ప్రసాద్, వంశీకృష్ణ బ్యాటింగ్ తోనూ శశికాంత్, అవినాష్, సత్యనారాయణ, స్టీఫెన్ చెలరేగే బంతులతో రాణించేందుకు సిద్ధమయ్యారు. యశ్వంత్, విజయ్, కుమార్ స్పిన్ మాయాజాలంతో ఆకట్టుకోనున్నారు.

నేటి మ్యాచ్‌లు

వైఎస్సార్ స్టేడియంలో ఉదయం 11 గంటలకు చండీగఢ్‌తో పుదుచ్చేరి, సాయంత్రం నాలుగున్నర గంటలకు విదర్భతో ఒడిశా తలపడనుంది. విజయనగరం పీవీజీ రాజు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఉదయం 11 గంటలకు అసోంతో రైల్వేస్ జట్టు పోటీపడనుంది.

మ్యాచ్‌లను ఉచితంగానే వీక్షించండి

దేశవాళీ టీ20 మ్యాచ్‌లను ఉచితంగానే స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. ఐపీఎల్, జాతీయ జట్లకు ఆడిన ఆటగాళ్లు ఎస్ఎంఏ టోర్నీలో పాల్గొంటున్నారు. విశాఖలో ఈ మ్యాచ్‌లను వీక్షించాలనుకునే అభిమానులను గేట్ నంబర్ 15 ద్వారా ప్రవేశం కల్పిస్తున్నాం. మ్యాచ్‌లు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం.

– సతీష్, కార్యదర్శి, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్